నేటి నుంచి కరుణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలు

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 26: మండలంలోని కరుణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలు గురువారం నుంచి మార్చి 2వ తేదీ వరకు మహోత్సవాలు జరుగుతాయని కరుణగిరి డైరెక్టర్ మాథ్యూ వరప్రసాదరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం నాలుగు గంటలకు ఖమ్మం బిషప్ సగిలి ప్రకాశ్ పతాక అవిష్కరణతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఈ మహోత్సవాలకు దేశవ్యాప్తంగా ఆయా ప్రాంతాలకు చెందిన బిషప్‌లు, విశ్రాంత పీఠాధిపతులు, ఫాదర్స్ తెలంగాణ, ఏపీలోని వివిధ జిల్లాల నుంచి లక్షది మంది భక్తులు హాజరవుతారన్నారు.

నర్సింహులగూడెం ఎత్తిపోతల నుంచి నీటి విడుదల

స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేస్తున్న ఇరిగేషన్ డీఈ బాణాల రమేశ్‌రెడ్డి

కూసుమంచి, ఫిబ్రవరి 26: మండలంలోని నర్సింహుల గూడెం ఎత్తిపోతలు మరమ్మత్తులకు గురై 400 ఎకరాల్లో ఆయకట్టుకు సాగునీటి ఇబ్బంది కలుగుతుండడంతో రైతులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి సమస్యను విన్నవించారు. స్పందించిన మంత్రి సంబంధిత అధికారులకు మరమ్మతులు చేసి నీరు అందించాలని ఆదేశించారు. మరమ్మతులు చేసి బుధవారం ఎస్ఈ మంగలపూడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో డీఈ బాణాల రమేశ్‌రెడ్డి బుధవారం నీటిని వదిలారు. కూసుమంచి, తురకగూడెం గ్రామాల్లోని రైతులకు యాసంగికి సాగు నీరు అందనుంది.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

వేంసూరు: పోలింగ్ సిబ్బందితో తహసీల్దార్ బాబ్జిప్రసాద్

వేంసూరు, ఫిబ్రవరి 26: ఆదివారం జరగనున్న నల్గొండ – వరంగల్– ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దార్ బాబ్జిప్రసాద్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. మండలంలో 65 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగులు హరిప్రసాద్, అజయ్, యాకుబ్, పోలీసులు పాల్గొన్నారు.

వైరాలో..

వైరా టౌన్: ఎన్నికల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు, అధికారులు

వైరా టౌన్, ఫిబ్రవరి 26: వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా అధికారులు ఎన్నికల ఏర్పాట్లు సిద్ధం చేశారు. మండలంలో 113 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందుకు గాను మూడు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఉదయం 8గంటల నుంచి 4 గంటల వరకు ఎన్నికల ప్రక్రియ కొనసాగనుంది. ఏర్పాట్లను తహసీల్దార్ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

ఎర్రుపాలెంలో..

ఎర్రుపాలెం: పోలింగ్ సిబ్బందితో తహసీల్దార్

ఎర్రుపాలెం, ఫిబ్రవరి 26: మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వరంగల్–ఖమ్మం– నల్గొండ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని బుధవారం పోలింగ్ సిబ్బంది చేరుకున్నారు. ఏర్పాట్లను తహసీల్దార్ ఎం.ఉషాశారద పరిశీలించారు. ఈ పోలింగ్ కేంద్రంలో 59 మంది ఓటర్లు వారి ఓటును వినియోగించుకోనున్నట్లు తెలిపారు.

కారేపల్లిలో..

కారేపల్లి, ఫిబ్రవరి 26: గురువారం జరగనున్న నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కారేపల్లిలో మూడు బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ సంపత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 177 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ ఉదయం 8 గంటల నుండి సాయంత్ర 4 గంటల వరకు సాగనుంది.

మధిర సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం

మధిర, ఫిబ్రవరి 26: మధిర సేవాసమితి నూతన కమిటీ ఏర్పాటు సందర్భంగా మధిర సేవాసమితి కార్యదర్శి వేముల నవీన్‌కుమార్– పూజితరాణి దంపతులు బుధవారం పట్టణంలోని ఆదరణ సేవా ఫౌండేషన్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాసమితి సభ్యులు నవీన్‌కుమార్ దంపతులను అభినందించారు. కార్యక్రమంలో మధిర సేవాసమితి అధ్యక్షుడు పల్లపోతుల ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి ముప్వా రామకృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి జంగా నర్సింహారెడ్డి, కోశాధికారి లింగంపల్లి అప్పారావు, ఉపాధ్యక్షుడు చల్లా సత్యనారాయణ, కస్తాల సతీశ్, ప్రోగ్రాం చైర్మన్ ఎస్‌కే.సైదా, ప్రధాన కార్యదర్శి బాణాల శంకరాచారి, ఆడిట్ కమిటీ చైర్మన్ ఏలూరి దుర్గాప్రసాద్, రంగిశెట్టి శ్రీనివాసరావు, దాచేపల్లి రాము, గుండూరి రాంబాబు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

WANTED

★ ఇల్లందు, టేకులపల్లి ప్రాంతాలలో రైస్‌మిల్లులో పనిచేయుటకు వర్కర్స్ కావలెను. జీతం: రూ.13,000/- నుండి 15,000/-ల వరకు, మరిన్ని వివరాలకు సంప్ర : 76758 96337.

KMM

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

బోనకల్లు, ఫిబ్రవరి 26: బోనకల్లు గ్రామానికి చెందిన మహిళ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన బుధవారం చోటు చేసుకున్నది. జనవరి 31న బోనకల్లు బీటీసీ కెనాల్ పరిధిలో ట్రాక్టర్ పల్టీ కొట్టి యార్లగడ్డ వరమ్మ మృతిచెందగా మరో 12 మందికి తీవ్రగాయాలైన విషయం పాఠకులకు విదితమే. వీరిలో లింగం నాగమణి (54) తలకు, చెస్ట్‌భాగంలో తీవ్రగాయాలు కావడం తో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి తీసుకువచ్చా రు. మళ్లీ అనారోగ్యానికి గురికావడంతో రెండు రోజుల క్రితం ఖమ్మం మమత ఆస్పత్రిలో చేర్పించారు. ఆరోగ్య పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలికి భర్త, పిల్లలు ఉన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616

ఇటుక బట్టీల అడ్డా @ రామన్నపేట

రామన్నపేటలో అక్రమ ఇటుక బట్టీలు, బట్టీల్లో గుట్టలుగా నిల్వ చేసుకున్న చెరువు మట్టి

- అక్రమంగా కొనసాగుతున్న వ్యాపారం
- చౌర్యానికి గురవుతున్న చెరువుమట్టి
- బంధీ అవుతున్న బాల్యం

రఘునాథపాలెం, ఫిబ్రవరి 26 : ఖమ్మం అర్బన్ పరిధిలోని రామన్నపేట ప్రాంతం అక్రమ ఇటుక బట్టీలకు అడ్డాగా తయారైంది. రామన్నపేట చుట్టుపక్కల వ్యవసాయ పొలాలన్నీ ఇటుకబట్టీలకు వేదికలయ్యాయి. రామన్నపేటను అక్రమ సంపాదనకు నిలయంగా మార్చుకొని వ్యాపారులు బట్టీలను నెలకొల్పి రూ.కోట్లు గడిస్తున్నారు. బట్టీల నిర్వహణలో నిబంధనలను పాతరేసి ప్రభుత్వానికి పన్ను కట్టకుండా ఎగనామం పెడుతున్నారు. బట్టీల నిర్వహణతో పర్యావరణం కాలుష్యం పెరిగిపోతోంది. చెరువుమట్టిని అక్రమంగా తరలించి బట్టీల్లో గుట్టలు గుట్టలుగా నిల్వ చేసుకుంటున్నారు. కలప వాడకంతో చెట్లు నరికివేతకు గురౌతున్నాయి. విద్యుత్ చౌర్యానికి గురౌతోంది. భూగర్భ జలం, నేల గుణగణాలు దెబ్బతింటున్నాయి. పట్టించుకోవాల్సిన సంబంధిత శాఖాధికారులు అటుగా కన్నెత్తి చూడటం లేదు. రామన్నపేట చుట్టుపక్కల పొలాల్లో ఎక్కడ పరిశీలించిన పదుల సంఖ్యలో ఇటుక బట్టీలు యధేచ్ఛగా సాగుతున్నాయి. పేదల అవసరాలను ఆసరా చేసుకొని వారి భూములను ఏళ్ల తరబడి లీజుకు తీసుకొని ఇటుకల దందా సాగిస్తున్నారు. మైనింగ్, రెవిన్యూ శాఖల మధ్య లోపించిన సమన్వయాన్ని క్యాష్ చేసుకుంటూ రెండుచేతులా సంపాదిస్తున్నారు. బట్టీ ఇటుకలను వరిపొట్టుతో కాల్చాలనే నిబంధన ఉన్నా.. కలపను వినియోగిస్తున్నారు. ఫలితంగా చుట్టుపక్కల ప్రాంతాల్లో చెట్లు ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి.

బట్టీల్లో తయారైన ఇటుక

గుట్టలుగుట్టలుగా చెరువుమట్టి నిల్వలు..

రామన్నపేటలో అక్రమంగా సాగుతున్న ఇటుక బట్టీలో ఏ బట్టీని పరిశీలించినా చెరువు మట్టి గుట్టలుగుట్టలుగా కనిపిస్తోంది. మట్టి తవ్వకాలతో చుట్టుపక్కల ఉన్న చెరువులు ఆనవాళ్లు కోల్పోతున్నాయి. రాత్రికి రాత్రి మట్టి తోలకాలు జరిపి నిల్వ చేసుకుంటున్నారు. ప్రభుత్వం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందిస్తుండగా ఇటుక బట్టీల నిర్వాహకులు తమ వ్యాపారానికి ఈ విద్యుత్తునే వాడకుంటున్నారు. దీనిపై ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వినిపిస్తున్నాయి.

బంధీ అవుతున్న బాల్యం..

పొట్ట చేత పట్టుకొని ఒరిస్సా నుంచి వచ్చిక కార్మికులు బట్టీల మాటున శ్రమ దోపిడీకి గురౌతున్నారు. కార్మికుల బిడ్డలు సైతం చదువులకు దూరమై వారి పసిప్రాయం బట్టీల్లోనే మసవుతోంది. ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేసి వలస కూలీలకు విద్యాబుద్ధులు చెప్పించాల్సిన అధికారులు బాధ్యతను విస్మరిస్తున్నారు. ఫలితంగా బాల్యం బట్టీల్లోనే బుగ్గిపాలవుతోంది. నిర్వాహకుల స్వార్థం మూలంగా అభం శుభం తెలియని అమాయక చిన్నారులు ఇటుక బట్టీల్లోనే పని చేయాల్సి వస్తోంది.

పటేల్ స్టేడియంలో మిస్ ఇండియా స్నిగ్ధ సందడి

క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతున్న మిస్ ఇండియా స్నిగ్ధ, టేబుల్ టెన్నిస్ క్రీడాకారులతో మిస్ ఇండియా స్నిగ్ధ

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 26: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో 'మిస్ ఇండియా' పిడమర్తి స్నిగ్ధ బుధవారం సాయంత్రం సందడి చేశారు. జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో రాణించిన క్రీడాకారులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ప్రధానంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన తల్లాడ క్రీడాకారులకు షూస్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ కేవలం కార్పొరేట్ నగరాలకే పరిమితమైన టేబుల్ టెన్నిస్ క్రీడ ఖమ్మంలో ఇంత గొప్పగా ఎదగడం ఆశ్చర్యాన్ని కలిగించిందన్నారు. తాను ఇక్కడ చదువుకునే రోజుల్లో అంతగా ప్రాచుర్యం లేదన్నారు. రానున్న రోజుల్లో జాతీయ, అంతర్జాతీయ పతకాలను గెల్చుకుని తెలంగాణ రాష్ట్రానికి, ఖమ్మానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ బాధ్యులు డాక్టర్ కూరపాటి ప్రదీప్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో మొదటి ర్యాంక్ సాధించిన క్రీడాకారుడు ఖమ్మానికి చెందినవారేనని, పటేల్ స్టేడియంలోనే శిక్షణ పొందాడని తెలిపారు. దీనికి ప్రధాన కారకులైన కోచ్ సాంబమూర్తికి అభినందనలు చెప్పారు. జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలసాని విజయ్ మాట్లాడుతూ ఖమ్మం టేబుల్ టెన్నిస్‌కు అంతర్జాతీయ శోభను తీసుకురావాలనే పట్టుదలతో తమవంతు బాధ్యతగా అన్నిరకాల వసతులు కల్పిస్తున్నామన్నారు. దీనిలో భాగంగానే ఇండోర్ హాల్ నిర్మాణం కోసం ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ పీవీ మేనేజర్, జిల్లా టీటీ బాధ్యులు ఎస్‌కే మజర్, పరిటాల చలపతి జోజి చాకో, పిట్టల కామేశ్వరి, గౌరిశెట్టి భవ్య చందు, ఆనం రాజేశ్, లాలయ్య, గద్దల రామారావు, కోచ్ సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ ఓపెన్ టెన్నిస్‌లో సంచలనాలు!

స్టేడియంలో కొనసాగుతున్న టెన్నిస్ పోటీలు

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 26: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా కొనసాగుతున్న చల్లపల్లి రాధమ్మ పురుషుల ర్యాంకింగ్ జాతీయ టోర్నమెంట్‌లో సంచలనాలు నమోదవుతున్నాయి. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో టాప్‌సీడ్ ఉదిత్ కంబోస్ (హర్యానా) ఆశ్చర్యకరమైన రీతిలో అథర్వ శర్మ(మహారాష్ట్ర) చేతిలో ఘోర పరాజయం పాలయ్యారు. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో 7-6(5), 1-6,6-3 తేడాతో ఓటమిని మూట గట్టుకున్నారు. అదేవిధంగా సింగిల్స్‌లో తెలంగాణ ఆశాకిరణం తీర్థ శశాంక్ మాచెర్ల (4) దురదృష్టవశాత్తు కుడి మణికట్టులో ఇన్‌ఫ్లమేటరీ గ్యాంగ్లియన్ కారణంగా గేమ్ మధ్యలోనే నిష్క్రమించారు. పురుషులు సింగిల్స్, డబుల్స్ మ్యాచ్‌లు క్వార్టర్ ఫైనల్ దాటి సెమీస్‌కు చేరుకున్నాయి. పోటీలను జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లపల్లి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ అనిల్ కాసినేని, ట్రెజరర్ కాంపాటి సత్యనారాయణ, చీఫ్ రిఫరీ ప్రవీణ్ నాయక్, కాళ్ల పాపారావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రమేశ్, కాళ్ల సూర్య పర్యవేక్షించారు.

రేపు చలో ఢిల్లీ


ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 26: బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాద, ఫాసిస్ట్, కార్పొరేట్ విధానాలను నిరసిస్తూ శుక్రవారం జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా) నాయకుడు కూసు అప్పారావు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని దమ్మాయిగూడెంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. తొలుత చలో ఢిల్లీ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు శివలింగం, హనుమంతరావు, సోమనపల్లి వెంకటేశ్వర్లు, ఆరెంపుల వెంకన్న, నరేశ్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి కాసాని ఐలయ్య

ఖమ్మం: మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం, వైరాటౌన్: అయిలయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

ఖమ్మం, ఫిబ్రవరి 26 : ప్రాణం పోయేంతవరకు ప్రజల కోసమే పోరాడిన కాసాని ఐలయ్య పేదల పక్షపాతి అని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. బుధవారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని సుందరయ్య భవనంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కాసాని ఐలయ్య సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న తమ్మినేని మాట్లాడుతూ రైతు కూలీలు, కార్మికులు, వృత్తిదారుల సమస్యలపై జరిగిన ఉద్యమాలకు ఐలయ్య నాయకత్వం వహించాడన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ రైతు సంఘాలు, వృత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసి రాజీలేని పోరాటాలు చేసిన ఐలయ్య జీవితం ప్రతిఒక్కరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు యర్రా శ్రీకాంత్, మాచర్ల భారతి, బండి రమేశ్, కళ్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, వీరభద్రం, రాంబాబు, పద్మ, శ్రీనివాసరావు, రమేష్ పాల్గొన్నారు.

భావితరాలకు ఆదర్శం అయిలయ్య జీవితం

వైరాటౌన్, ఫిబ్రవరి 26: భావితరాలకు కాసాని అయిలయ్య జీవితం ఆదర్శమని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. బుధవారం వైరాలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన అయిలయ్య సంతాప సభలో ఆయన మాట్లాడారు. తొలుత అయిలయ్య చిత్రపటానికి జనవిజ్ఞాన వేదిక నాయకుడు మల్లెంపాటి వీరభద్రం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం రాంబాబు మాట్లాడుతూ పేదలు, రైతుల కోసం తుదిశ్వాస విడిచే వరకు అవిశ్రాంతంగా కృషి చేసిన యోధుడు అయిలయ్య అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా వీరభద్రం, మాజీ ఎంపీపీ బొంతు సమత, రైతు సంఘం పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, పారుపల్లి కృష్ణారావు, గుమ్మా నర్సింహారావు, తోట కృష్ణవేణి, షేక్ పాషా, నర్వనేని ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహా శివరాత్రి వేడుకలు

మార్మోగిన శివ నామస్మరణ

భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు

ఖమ్మం, ఫిబ్రవరి 26 : ఖమ్మం జిల్లావ్యాప్తంగా బుధవారం మహా శివరాత్రి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. జిల్లాలోని ప్రముఖ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అదేవిధంగా సమీప ఆలయాలకు భారీగా చేరుకుని శివుడికి అభిషేకాలు చేశారు. నైవేద్యాలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తుల తాడికితో శివాలయాలు కిక్కిరిసిపోయాయి. ఎటుచూసినా శివ నామస్మరణ మార్మోగింది. రోజంతా ఉపవాస దీక్ష చేపట్టారు. రాత్రంతా జాగారం చేసి భగవంతుని సన్నిధిలో గడిపారు. ఖమ్మం నగరంలోని గుంటుమల్లేశ్వరస్వామి ఆలయంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర– విజయలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మధిర పట్టణంలోని శివాలయంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమలరాజు శివుడికి అభిషేకాలు నిర్వహించారు. మధిరలోని శ్రీమృత్యుంజయ స్వామికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క దంపతులు పూజలు నిర్వహించారు. ఖమ్మంరూరల్ మండలంలోని తీర్థాల(కూడెల్లి) ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు తదితరులు పూజల్లో పాల్గొన్నారు. శివ పార్వతుల కళ్యాణం అత్యంత వైభవంగా జరిగింది. కూసుమంచి శివాలయంలో ఎంపీలు రామసహాయం రఘురాం రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే కందాళ ప్రత్యేక పూజలు చేశారు. పెనుబల్లి మండలం నీలాద్రీశ్వరుడి ఆలయం, మర్లకుంటలో భ్రమరాంభ మల్లికార్జునస్వామి ఆలయం, కల్లూరు కాశ్మీర మహాదేవక్షేత్రంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పూజలు చేశారు. సత్తుపల్లి మండలం గంగారం 15వ బెటాలియన్‌లో ఉన్న శ్రీభ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో బెటాలియన్ సభ్యులు పూజలు నిర్వహించారు. వైరా మండలం స్నానాల లక్ష్మీపురం గ్రామంలోని శ్రీరామ లింగేశ్వరస్వామి ఆలయంలో రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. కారేపల్లి మండలం కోటిలింగాలలో జరిగిన పూజల్లో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో ఫ్లెక్సీ తొలగింపు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 26 : జిల్లా సార్వజనీన ఆసుపత్రి ప్రధాన ద్వారాల ఎదుట ఓ ఉద్యోగ సంఘం ఫ్లెక్సీలను ఎట్టకేలకు అధికారులు తొలగించారు. మూడునెలల క్రితం ఒక వేడుక విషయమై అతిథులకు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. వాటిపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, పలువురు మంత్రులు, కలెక్టర్, సీపీ, ఉద్యోగ సంఘాల రాష్ట్ర, జిల్లా బాధ్యుల ఫొటోలు ఉన్నాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ వాటిని తొలగించడంలో వైద్యవర్గాలు అలసత్వం ప్రదర్శించాయి. ఈ నేపథ్యంలో 'ఈసీ నిబంధనలా? తూచ్' అనే శీర్షికన సోమవారం నమస్తే తెలంగాణ కథనాన్ని ప్రచురించింది. దీంతో స్పందించిన యంత్రాంగం ఆగమేఘాల మీద తమ సిబ్బందితో ఫ్లెక్సీలను తీయించి వేశారు. ఇదే విషయమై దవాఖాన మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్ కుమార్‌ను వివరణ కోరగా త్వరలోనే ప్రభుత్వ వైద్యారోగ్య కార్యక్రమాలకు సంబంధించిన అంశాలు ప్రజలకు తెలిసేలా పోస్టర్స్‌ను అంటిస్తామని తెలపడం గమనార్హం.

వైరాలో..

ఫ్లెక్సీలను తొలగిస్తున్న మున్సిపాల్ సిబ్బంది

వైరాటౌన్, ఫిబ్రవరి 26: జాతరలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. స్పందించిన మున్సిపల్ అధికారులు బుధవారం ఫ్లెక్సీలను తొలగించి మున్సిపాల్ కార్యాలయానికి తరలించారు. మండలంలోని స్నానాల లక్ష్మీపురం గ్రామంలో స్వయంభు శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో జరిగే జాతర సందర్భంగా మున్సిపాల్టీ పరిధిలోని 10వ వార్డులో గల గండగలపాడు గ్రామం నుంచి లక్ష్మీపురం గ్రామం వరకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను అధికారులు తొలగించారు. ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ నాయకుల ఫొటోలు ఉండడంతో కోడ్ ఉల్లంఘించినట్లు గుర్తించిన అధికారులు ఫ్లెక్సీలను తొలగించారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై, ఆలయ కమిటీ సభ్యులు

ఎర్రుపాలెం, ఫిబ్రవరి 26: మండలంలోని బనిగండ్లపాడులో మహాశివరాత్రి సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలస్థాయిలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను బుధవారం ఎస్సై వెంకటేశ్, ఆలయ కమిటీ చైర్మన్ యన్నం పిచ్చిరెడ్డి, వైస్‌చైర్మన్ పెద్దమళ్ల మోహన్‌రావు, సొసైటీ మాజీ చైర్మన్ యన్నం సత్యనారాయణరెడ్డి, గ్రామస్తులు ప్రారంభించారు. ఎస్సై మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక ఉల్లాసం, స్నేహభావం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు బొగ్గుల రామచంద్రారెడ్డి, ఎదురు కృష్ణారెడ్డి, బాణాల శ్రీనివాసరావు, శాగం లక్ష్మీకుమార్‌రెడ్డి, బొగ్గుల చిన్నశ్రీనివాసరెడ్డి, పెద్దమళ్ల రాంబాబు, తాళ్లూరి నాగరాజు, తల్లపురెడ్డి రామిరెడ్డి, పెద్దమళ్ల శ్రీనివాసరావు, నాగభూషణ్‌రెడ్డి, పీఈటీలు గూడూరు సత్యనారాయణరెడ్డి, తల్లపురెడ్డి గోపి, క్రీడాకారులు పాల్గొన్నారు.

'శ్రీపాల్ రెడ్డి గెలుపు తథ్యం'

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 26 : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ అభ్యర్థి పీ శ్రీపాల్‌రెడ్డి గెలుపు తథ్యమని జిల్లా పీఆర్‌టీయూ మాజీ అధ్యక్షుడు మోత్కూర్ మధు అన్నారు. బుధవారం ఖమ్మం నగరంలోని సంఘం కార్యాలయంలో పోలింగ్ ఏజెంట్లకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ ముందుందని, టీచర్ల అప్‌గ్రేడేషన్, ఉద్యోగోన్నతులు, బదిలీలు అన్ని పీఆర్‌టీయూతోనే సాధ్యమయ్యాయన్నారు. ఉపాధ్యాయుల కోసం పోరాడే సంఘం పీఆర్‌టీయూ మాత్రమేనన్నారు. సమావేశంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు, నాయకులు విజయ్‌అమృత్‌కుమార్, కట్టా శేఖర్‌రావు, సోమ్లానాయక్, ఆంజనేయులు, గూడిపూడి శ్రీనివాస్, బంకా గురవయ్య పాల్గొన్నారు.

పూర్వ గవర్నర్ డాక్టర్ మురళీకృష్ణకు సన్మానం

మురళీకృష్ణను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

వైరాటౌన్, ఫిబ్రవరి 26: సూర్యాపేటలోని గండూరి గార్డెన్స్‌లో బుధవారం జరిగిన పూర్వ జిల్లా గవర్నర్ సన్మానోత్సవ వేడుకల్లో జిల్లా 320 గవర్నర్ యారాల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఖమ్మం, నల్గొండ జిల్లాల 320 మాజీ గవర్నర్ గాట్ అంబాసిడర్ వైరా లయన్స్ కంటి ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ కాపా మురళీకృష్ణను సన్మానించారు. కార్యక్రమంలో సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కేవీ.ప్రసాద్, జిల్లా క్యాబినెట్ సెక్రెటరీ శివశంకర్, సింహాద్రి, జిల్లా క్యాబినెట్ ట్రెజరర్ తుమ్మలూరి మురళీధర్‌రెడ్డి, జిల్లా క్యాబినెట్ జాయింట్ సెక్రెటరీ లగడపాటి ప్రభాకర్, జీఎస్టీ కోఆర్డినేటర్ వుండ్రు శ్యామ్‌బాబు, జీఎల్‌టీ కోఆర్డినేటర్ సతీశ్‌కుమార్, వసుంధర దేవి, వైరా లయన్స్‌క్లబ్ అధ్యక్షులు చింతలపూడి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సాగర్ కాలువలో పడి యువకుడు గల్లంతు


అశోక్(ఫైల్)

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 26: మండలంలోని పల్లెగూడెం సమీపంలో ప్రవహిస్తున్న సాగర్ కాలువపడి ఓ యువకుడు గల్లంతైన ఘటన బుధవారం మండలంలో వెలుగు చూసింది. ప్రత్యక్ష సాక్షులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోగల పెద్దతండా ఇందిరమ్మ కాలనీకి చెందిన గోలి అశోక్ (38) సాయంత్రం తీర్థాల సంఘమేశ్వర స్వామి దర్శనానికి స్నేహితుడితో కలిసి వెళ్లాడు. మార్గమధ్యలో పల్లెగూడెం వద్ద ఉన్న నాగార్జున సాగర్ కాలువలో స్నానం చేద్దామనే కిందికి దిగాడు, అయితే ప్రమాదవశాత్తు నీళ్లలో జారి పడి అశోక్ గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న అశోక్ కుటుంబ సభ్యులు సాగర్ కాలువ పొడవున గాలించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.